టపాస్ ఎప్పుడో..?

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు భారీగా దరఖాస్తులు

- నేటికీ అనుమతి ఇవ్వని అధికారులు
- పండుగ దగ్గర పడుతుండటంతో టెన్షన్‌లో వ్యాపారులు
- లైసెన్సు ఇవ్వకనే బాణసంచా నిల్వలు



పుట్టపర్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాణాసంచా తాత్కాలిక దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. వీటి జాబితాను ఆయా రెవెన్యూ డివిజన్ల నుంచి పట్టణ, మండల కేంద్రాలకు పంపారు. దీంతో ఆయా అధికారులు దరఖాస్తులతో పాటు కొన్నిచోట్ల స్థలాను సైతం పరిశీలించారు. ఇంతవరకు బాగానే ఉన్నా లైసెన్సుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. పండుగకు కేవలం మూడు రోజులే ఉన్న నేపథ్యంలో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. బాణాసంచా దుకాణాల ఏర్పాటు అంశంపై జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుదారులతో సమావేశం పెట్టాల్సి ఉన్నా దాని జాడ ఇంకా ఎక్కడ కనిపించడం లేదు.

అధికారుల చుట్టూ చక్కర్లు

దీపావళి పండుగ నేపథ్యంలో ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. వ్యాపారం లాభసాటిగా ఉండటంతో చాలామంది తాత్కాలిక లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా హిందూపురం 91, కదిరి 53, ధర్మవరం 29, పెనుకొండ 14 , పుట్టపర్తి 12, కొత్తచెరువు 17, మడకశిరకు ఆరు దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 376 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. పండుగకు కేవలం మూడు రోజులే ఉన్నా ఎటూ తేల్చకపోవడంతో దరఖాస్తుదారులు అనుమతుల కోసం అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొందరు టపాసులు వ్యాపారులు రింగుగా ఏర్పడి 'దుకాణాలు ఏర్పాటుకు ఎన్‌ఓసీలు వస్తాయి. మీరు ఏర్పాట్లు చేసుకోండి' అని భరోసా ఇస్తున్నట్లు సమాచారం. బాణసంచా వ్యాపారంలో లక్షల రూపాయల లాభం వస్తుందన్న ఆశతో అనుభవం లేకున్నా ఎక్కువ మంది పోటీపడి దరఖాస్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కంటే ఈ ఏడాది భారీగా దరఖాస్తులు రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా హిందూపురం, కదిరిలో తీవ్ర పోటీ నెలకొంది. బాణసంచా లైసెన్సుల విషయంలో ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ దళారులు సైతం రంగంలో దిగి తమకు ఇవ్వాల్సింది ఇచ్చేస్తే దుకాణం పెట్టమని, లేదంటే పోటీపెడతామని బెదిరిస్తున్నారు. అలాగే తమకున్న పలుకుబడితో ముందుస్తుగా బాణసంచా నిల్వలు చేసి వారిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో దాడులు చేయిస్తున్నారు.

ఆ శాఖలు ఎస్ అంటేనే..

దీపావళి వచ్చిందంటే చాలు కొన్ని శాఖలకు ఏడాది పెద్ద పండగ వచ్చినట్లే. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల నుంచి అనుమతులు, దుకాణాల ఏర్పాటు దాకా భారీగా ఆమ్యామ్యాలు ఆయా శాఖలకు అందుతాయి. హోల్‌సేల్ నుంచి బాణసంచా వ్యాపారుల దాకా తలా ఇంత వసూలు చేసి కొన్ని శాఖలకు ముట్టజెప్పాల్సిందే. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా పరిశీలించి, ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు శాఖల వారిగా చలానాలతో పాటు జీఎస్టీ చెల్లించాలి. అగ్నిమాపక శాఖ నుంచి వచ్చే ఎన్‌ఓసీని కలెక్టరేట్‌కు పంపితే, అక్కడి నుంచి సబ్ డివిజన్ వారీగా అనుమతు లు వెళ్తాయి. సబ్ డివిజన్ స్థాయిలో ఆర్డీఓ మండల స్థాయిలో తహసీల్దార్‌లు సంబంధిత టపాసుల వ్యాపారీకి విక్రయాలకు స్థలం మంజూరు చేస్తారు. హిందూపురం, ధర్మవరం, కదిరిలో టపాసుల దుకాణం ఏర్పాటు చేయాలంటే అంత సులుగా అనుమతి రాని పరిస్థితి ఉంది. ఓశాఖ ముందస్తుగానే దరఖాస్తుదారుల ముక్కుపిండి వసూళ్లు చేసి తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా జిల్లాలో టపాసులు నిల్వ చేసేందుకు లైసెన్సు కలిగిన గోదాములు హిందూపురం ప్రాంతంలో కొందరికే ఉన్నాయి. అయితే చాలా మంది వ్యాపారులు ఆయా పట్టణ, గ్రామాల్లో ఇళ్ల మధ్యనే టపాసులు నిల్వ చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది.

అంతా పారదర్శకం

జిల్లాలో బాణసంచా దుకాణాలకు తాత్కాలిక లైసెన్సు మంజూరు విషయంలో అంతా పారదర్శకంగా సాగుతోంది. దుకాణాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు పంపించాం. వారే అనుమతులు ఇస్తారు. ఈఅంశంపై జిల్లా కలెక్టర్ సమీక్ష చేసి ఆర్డీఓకు అప్పగించారు. సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించిన మీదట అనుమతు లు ఇస్తారు. దుకాణాల ఏర్పాటుకు శుక్రవారంలోపు లైసెన్సులు ఇస్తాం.

- సూర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్వో

జూదరులకు అడ్డా..!

- ధర్మవరంలో జోరుగా పేకాట
- నిద్రావస్థలో నిఘా
- నామమాత్రపు దాడులతోనే పోలీసులు సరి



ధర్మవరం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జూదరులకు ధర్మవరం అడ్డాగా మారింది. పట్టణంతోపాటు రూరల్ మండలం, బత్తలపల్లి, ముదిగుబ్బ ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని జోరుగా జూదం ఆడుతున్నారు. పేకాట స్థావరాలను ముందస్తుగా పోలీసులు అరికట్టలేకపోతున్నారు. ప్రజలు ఇచ్చే సమాచారంతోనే దాడులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలో వైసీపీ నాయకులతో కొందరు అధికార పార్టీ నాయకులు కూడా చేతులు కలిపినట్లు ప్రచారం జరుగుతోంది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కూడా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నెల 12న పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్‌లో వైసీపీ నాయకుడు నేలకోట ఓబిరెడ్డితో పాటు మరో 8మంది పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ దాడులలో రూ.1.77 లక్షల నగదు, 9సెల్‌ఫోన్‌లను స్వాధీనం చే సుకున్నారు. శివానగర్‌లో ఓ పేకాటస్థావరంపై దాడులు చేశారు. మండలంలోని గరుడంపల్లి, నాగలూరు, దర్శినమల, రావులచెరువు తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. బత్తలపల్లి, పత్యాపురం, ముదిగుబ్బ మండలంలో పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు.

ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారంటే..

ధర్మవరం పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ధర్మవరం పట్టణంలో కొంతమంది ఇళ్లలోనే నిర్వహిస్తుండగా మరికొందరు తోటల వద్ద, గెస్ట్‌హౌస్‌లలో నిర్వహిస్తున్నారు. కేతిరెడ్డికాలనీ, ఇందిరమ్మకాలనీ, శివానగర్ సమీపాల్లో, చుట్టు పక్కన పొలాల్లో, గూడ్స్‌షెడ్‌కొట్టాల సమీపంలో, ధర్మవరం మండలంలోని కుణుతూరు జగనన్న లేఅవుట్ సమీపంలో, రాంపురం, గరుడంపల్లి, నాగలూరు, దర్శినమల తదితర గ్రామాల వద్ద స్థావరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ముదిగుబ్బ మండలం మారాల, క్రిష్ణాపురం, బత్తలపల్లి మండల కేంద్రం, పత్యాపురం గ్రామ సమీపంలో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకుని జూదం ఆడుతున్నట్లు సమాచారం.

నామమాత్రంగా దాడులు

ధర్మవరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో జోరుగా పేకాట ఆడుతున్నా నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉందనే విమర్శలు ఉన్నాయి. రూ.లక్షల్లో పట్టుబడుతున్నారంటే ఏ స్థాయిలో పేకాట జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ధర్మవరం పట్టణంలో ఓ వైసీపీ నేత నిర్వహిస్తున్న పేకాట రోజూ రూ.లక్షల్లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. భారీస్థాయిలో పేకాట ఆడుతున్నా పోలీసులు నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

అరికడుతున్నాం..

పేకాట స్థావరాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికడతున్నాం. ఇటీవల ధర్మవరం పట్టణంతో పాటు రూరల్ మండలం, బత్తలపల్లి ప్రాంతాల్లో దాడులు చేసి అరెస్టు చేశాం. ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే దాడులు నిర్వహించి అరెస్ట్ చేస్తాం. ఎంతటివారినైనా వదిలేదిలేదు.

-హేమంత్‌కుమార్, డీఎస్పీ, ధర్మవరం

రైతుల సమ్మతితోనే
సోలార్‌కు భూములు

- కలెక్టర్ శ్యాంప్రసాద్



వేరుశనగ పంట దిగుబడిని పరిశీలిస్తున్న కలెక్టర్

నంబులపూలకుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుల సమ్మతితోనే సోలార్‌కు భూములు సేకరిస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. కోటిరెడ్డివారిపల్లి సమీపాన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నేషనల్ హరితామృత్ లిమిటెడ్, నెట్‌క్యాప్, ఎన్‌టీపీసీ సంయుక్తాధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మండలంలోని కొట్టంవారిపల్లి సమీపాన రైతు నారాయణ సాగుచేసిన వేరుశనగ, కంది, మినుము పంటలను పరిశీలించారు. పంట దిగుబడిని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు వస్తాయని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రపంచ ప్రసిద్దిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. తిమ్మమాంబ, బాల వీరయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చేరుకున్నారు. పరిశోధనలు, పంట సాంకేతికత, రైతుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల గురించి శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏడీఏ సనావుల్లా, ఎంపీడీఓ కోలప్ప, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దీపికకు అసమ్మతి సెగ

- సస్పెండ్ చేసినా తగ్గని వైనం
- 'పురం'లో రచ్చకెక్కిన వైసీపీ వర్గపోరు
- నానాటికి తీసికట్టుగా పార్టీ పరిస్థితి

హిందూపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అసమ్మతి, వర్గపోరుతో నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎవరున్నా అసమ్మతి మాత్రం తప్పడం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి కూడా ఇదే పరిస్థితి. కొందరు పార్టీ ముఖ్య నాయకులను సస్పెండ్ చేసినా వర్గపోరు మాత్రం సమసి పోలేదు. ప్రస్తుత సమన్వయకర్త దీపికను గ్రామంలోకి రాకుండా సొంత పార్టీ వారే అడ్డుపడ్డారంటే ఆ పార్టీలో అసమ్మతి ఏస్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. గత ఎన్నికలకు ముందు 2023లో ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహ్మద్ ఇక్బాల్‌ను తప్పించి దీపికకు బాధ్యతలు అప్పగించారు. ఆమె బెంగళూరు నుంచి ఇక్కడికి రావడంతో స్థానికంగా ఉన్న మాజీ సమన్వయకర్త వేణుగోపాల్‌రెడ్డి, నవీన్‌నిశ్చల్ వ్యతిరేకిస్తూ వచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డిని తాడిపత్రికి పంపి, అక్కడ ఎన్నికల విధులు చూడాలని అధిష్టానం ఆదేశించింది. అయితే పార్టీ తాడిపత్రి, హిందూపురంలో రెండు చోట్ల ఘోరంగా ఓడిపోయింది. అయినా దీపికనే పురం ఇన్‌చార్జ్‌గా కొనసాగిస్తున్నారు. అయితే ఆమెకు రెండు వర్గాల నుంచి అసమ్మతి సెగ ఎదురవుతూనే ఉంది.

రచ్చకెక్కిన వర్గపోరు

ఆవిర్భావం నుంచి హిందూపురంలో వైసీపీ గెలిచింది లేదు. అయితే ఇన్‌చార్జ్‌లు మాత్రం ఇప్పటికే ఆరుగురు మారారంటే ఆ పార్టీలో వర్గపోరు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని నెలల కిందట ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్, మాజీ సమన్వయకర్త వేణుగోపాల్‌రెడ్డిని పార్టీ నుంచి దీపిక సస్పెండ్ చేయించగలిగారు. వేణుగోపాల్‌రెడ్డి ఆవిర్భావం నుంచి పార్టీ వెంటే ఉన్నాడు. నవీన్‌నిశ్చల్‌కూడా 2013నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. అయినా వీరిద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించడంలో దీపిక వర్గం సఫలీకృతం అయ్యింది. సస్పెన్షన్ తర్వాత నవీన్‌నిశ్చల్ కొద్దిరోజులుగా మౌనంగా ఉన్నాడు. అయితే వేణుగోపాల్ రెడ్డి మాత్రం ఆయనకున్న పరిచయాలతో వైసీపీ నాయకులతో కలిసి ఇతర ప్రాంతాల్లో ఉన్న పెద్దలతో తరచూ కలుస్తున్నాడు. వేణుగోపాల్‌రెడ్డి వర్గంలో ప్రస్తుతం కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులున్నారు. ఇది దీపిక వర్గానికి మింగుడు పడటంలేదు. దీంతో ఆయనపై తరచూ ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం లేపాక్షి మండలం కొండూరుకు ఇన్‌చార్జ్ దీపిక వెళ్లగా వేణుగోపాల్‌రెడ్డి వర్గీయులైన జడ్పీటీసీ, మరికొంతమంది నాయకులు ప్రతిఘటించారు. సీనియర్లు లేకుండా మీరెలా కార్యక్రమం నిర్వహిస్తారని గట్టిగా వాదించి గ్రామంలోకి ఆమె కారును రానీయకుండా అడ్డుకున్నారు. కొద్దిసేపటి తరువాత వేరే నాయకులు జోక్యం చేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది. అయినా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌నే సొంత పార్టీవారు అడ్డుకోవడం ఆ పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.



లేపాక్షి మండలం కొండూరు వద్ద ఈనెల 15న కారును అడ్డుకోవడంతో కిందకు దిగి మాట్లాడుతున్న దీపిక

సస్పెండ్ చేసినా తగ్గని వైనం

సీనియర్ నాయకులైన నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినా నాయకులు, కార్యకర్తలు తగ్గలేదు. ముఖ్య నేతలను సస్పెండ్ చేస్తే వారివద్ద ఉన్న కార్యకర్తలు భయపడతారని దీపిక వర్గం భావించింది. కానీ కొండూరు ఘటనతో అది భ్రాంతేనని తేలింది. నియోజకవర్గంలోని మరికొన్ని ప్రాంతాలకు వెళ్లినప్పుడు కూడా ఆమెకు ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఆ పార్టీవారు చెబుతుండటం గమనార్హం.

నేడు మడకశిరకు రైల్వే సహాయ మంత్రి

- రైల్వే లైన్ పనుల పరిశీలన

మడకశిర టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే సహాయ మంత్రి సోమన్న శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. తుమకూరు-రాయదుర్గం రైల్వే లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయడంలో భాగంగానే మంత్రి పర్యటిస్తున్నారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పట్టణ సమీపంలో రైల్వే పనులను పరిశీలిస్తారన్నారు. రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే పారిశ్రామిక అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయనీ, వాటిని తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు 5





అక్షరాల హరివిల్లు
- పచ్చని చెట్లతో అలరిస్తున్న మధూడి జడ్పీహెచ్‌ఎస్
- సాంకేతిక పద్ధతులతో విద్యార్థులకు ప్రత్యక్షానుభూతి

4

మద్యం ఇక సురక్షతం..!
- సురక్ష యాప్‌తో నకిలీ, కల్తీ మద్యానికి చెక్
- కొన్నచోటే వినియోగదారుడు పరిశీలించవచ్చు
- స్కాన్ చేయగానే బాటిల్ చరిత్ర ప్రత్యక్షం



సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్

- నిరంతరాయంగా సరఫరా
- అదనపు ఆదాయం
- సబ్సిడీతో ప్యానెల్స్ ఏర్పాటు

నంబులపూలకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకంతో పల్లెల్లో విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. ఈ పథకం ద్వారా వినియోగదారులకు ఉచిత విద్యుత్ లభిస్తుంది. మిగులు విద్యుత్ విక్రయించి ఆదాయం పొందే అవకాశం ఉంది. బీడు భూములు, సాగుకు నోచుకోని భూములలో సోలార్ పార్క్ ఏర్పాటు చేసి రైతులు ఏడాదికి ఆదాయం అందించే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తున్నాయి. సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పకే జిల్లాలో ఎన్నో సోలార్ పార్క్‌లు ఉన్నాయి. ఏడాదికి ఎకరాకు రూ. 31వేలు లీజుగా రైతులకు చెల్లిస్తున్నాయి. వినియోగదారులు ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుంది. నెలనెలా విద్యుత్ బిల్లు కట్టే బాధ ఉండదు. పైగా మిగులు విద్యుత్ కొనుగోలును ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుంది.



వినియోగదారుడికి ఆదాయం

ఇంటిపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వినియోగానికి పోనూ మిగిలిన విద్యుత్‌ను విక్రయించుకోవచ్చు. ప్రతి నెలా వినియోగదారుడికి ఆదాయ వనరుగా ఉంటుంది. ఈ పథకాన్ని ప్రభుత్వం, బ్యాంకులు ప్రోత్సహిస్తున్నాయి. ఒకసారి ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే 25 సంవత్సరాల వరకు విద్యుత్ వినియోగం చేసుకోవచ్చు. ఇంటి పైకప్పు కనీసం 100 చదరపు అడుగులు ఉంటే కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. కిలోవాట్‌కు రూ. లక్ష ఖర్చు అవుతుంది. 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రూ. 30వేలు రాయితీని పొందవచ్చు. రెండు కిలోవాట్లకు రూ.1.40 లక్షలు ఖర్చు చేయాలి. 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రూ. 60 వేల రాయితీ పొందవచ్చు. మూడు కిలోవాట్లకు రూ.2.30 లక్షలు ఖర్చు అవుతుంది. 360 యూనిట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రూ. 78 వేలు రాయితీ పొందే అవకాశం ఉంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ ఎను ఏర్పాటు చేసుకుంటే.. ఇంటి అవసరాలకు కావల్సిన విద్యుత్‌ను వినియోగించుకొని మిగిలిన దానిని విక్రయించుకునే అవకాశం ఉంది. బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయి. సబ్సిడీ పోనూ యూనిట్ విలువ మొత్తంలో 90శాతం వరకు రుణ సదుపాయం ఉంటుంది. రుణ మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించుకోవచ్చు. మిగిలిన విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.09 చొప్పున విద్యుత్‌శాఖ కొనుగోలు చేస్తుంది.



ఎన్‌పీకుంటలో ఇంటి పైభాగంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

ఎంతో ఉపయోగకరం



సూర్యఘర్ పథకం ద్వారా ఎంతో ఉపయోగకరం. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చాను. ఒక్క పైసా చెల్లించకుండానే సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. మన ఇంటి అవసరాలకు పోనూ.. మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. మా ఇంటిపై మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.3.30 లక్షలు ఖర్చు అవుతుంది, అందులో రూ. 78 వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. మిగిలిన మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించాలి.

-రామాంజనేయులు, నంబులపూలకుంట

పల్లెల్లో కోత బాధలు ఉండవు



ఉరుములు, మెరుపులు వచ్చాయంటే విద్యుత్ అంతరాయం జరుగుతుంది. పల్లెల్లో విద్యుత్ కోతల సమస్య నుంచి బయటపడవచ్చు. మిగిలిన విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం లభిస్తుంది. 25 సంవత్సరాల వరకు విద్యుత్ సమస్య ఉండదు. కరెంటు బిల్లు కట్టే బాధ ఉండదు. ఇంటి పైభాగం ఖాళీగా ఉంటుంది. ప్యానెళ్ల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. మిగిలిన విద్యుత్ ద్వారా కుటుంబానికి ఆదాయం సమకూరుతుంది.

-వేణుగోపాల్‌రెడ్డి, తూర్పునడింపల్లి

మామూళ్లు ఇస్తేనే రుణం !

పుట్లూరు ఐకేపీ కార్యాలయంలో అక్రమ వసూళ్లు

వడ్డీలేని రుణాలపై కొందరు సిబ్బంది చేతివాటం



పుట్లూరు ఐకేపీ కార్యాలయం



పుట్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చే రుణాలకు కొందరు సిబ్బంది మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఐకేపీ కార్యాలయంలో పని చేసే కొందరు మహిళల నుంచి అక్రమ వసూళ్లకు దిగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను మంజూరుచేస్తోంది. ఒక్కో సంఘంలోని సభ్యురాలికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాన్ని మంజూరు చేస్తోంది. యానిమేటర్లు దరఖాస్తులను చూసి రుణం మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సీసీలకు బదిలీచేస్తారు. సంబంధిత అధికారి సంతకాలు పెట్టిన తర్వాత బ్యాంక్ అధికారులకు బదిలీచేస్తారు. కానీ ఇవన్నీ జరిగాక డబ్బుల కోసం మహిళా సంఘాల సభ్యురాళ్లను కొందరు సిబ్బంది వేధిస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోతే గతంలో తీసుకున్న రుణాలు సరిగా కట్టలేదంటూ, మీకు ఇవ్వడం కుదరదంటూ సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇస్తే మాత్రం తొందరగా మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా 45సంఘాల్లోని 114మంది సభ్యురాళ్లకు త్వరలో రూ.60.3లక్షల రుణాలను మంజూరు చేయనున్నట్లు సమాచారం.

కొందరు అధికారుల ఇష్టారాజ్యం

సంఘాల్లోని సభ్యురాళ్లకు పాతబకాయిల పేరిట రుణాలు ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రుణాలు మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రుణాలు మంజూరుచేస్తే ఒక్కో సభ్యురాలి నుంచి రూ.ఐదారు వందలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై ఐకేపీ ఏపీఎం వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా తమ కార్యాలయంలో అలాంటివి జరగవని, తమ దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రధాని సభలో అనంత నేతల సందడి

- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు



సభాప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలు సునీత, సింధూర, శ్రావణిశ్రీ



అనంతపురం ఎమ్మెల్యే, ఇతర నేతలు



అనంత జిల్లా అధ్యక్షుడు, అనంతపురం ఎంపీ, నాయకులు

అనంతపురం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభలో అనంత ప్రజాప్రతినిధులు సందడి చేశారు. గురువారం కర్నూలు జిల్లాలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభ నిర్వహించగా... జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. హిందూపురం, అనంతపురం ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ అనంత జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాప్తాడు, అనంతపురం, శింగనమల, పుట్టపర్తి ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో రాప్తాడు ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ... కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధాని మోదీ, సీఎం ప్రసంగాలు స్ఫూర్తి నింపాయన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... డబుల్ ఇంజిన్ సర్కారుతో ఏపీలో జెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతోందన్నారు. దేశానికి మోదీ, రాష్ట్రానికి చంద్రబాబు వరం అన్నారు. విశాఖకు వచ్చిన గూగుల్ డేటా సెంటర్‌తో ఏపీ దేశంలోనే ఐకాన్‌గా నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రధాని సహకారంతో ఏపీకి మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హరికృష్ణ, నాయకులు రాయల్ మురళి, వెంకటప్ప, ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు

సభకు వేలాది బస్సులు ఇలా...

మోదీతో చంద్రబాబు, పవన్

సభలో ఉప్పొంగిన దేశభక్తి

సభలో టీడీపీ మహిళా నేతలు



నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు, ఆంధ్రజ్యోతి



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



పొలాల వెంబడి పరుగులు



ఆహ్లాదకరమైన పచ్చనిచెట్ల మధ్య ఉన్నత పాఠశాల

ఆ ప్రాంగణంలోకి వెళ్లగానే ఓ ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. చుట్టూ పచ్చని చెట్లు, అందమైన పూల మొక్కలతో అది ఓ ఉద్యానవనాన్ని తలపిస్తుంది. రణగొణ ధ్వనులు లేని పరిశుభ్రమైన ఆ ప్రాంతం ఓ ఆశ్రమంలా అగుపిస్తుంది. అదే మధూడి ఉన్నత పాఠశాల. ఇక్కడి ఉపాధ్యాయులు అద్భుతమైన టీచింగ్ టెక్నిక్‌లు ఉపయోగిస్తు, ప్రయోగ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు మానసికంగా దృఢత్వం, ప్రశాంతత పొందడానికి యోగా శిక్షణ సైతం ఇస్తున్నారు. వీటి ఫలితమే గత కొన్నేళ్లుగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత. ఇంతటి విజయం ఒక రోజు, నెల, ఏడాదిలో సాధ్యం కాలేదు. దీని వెనుక కొన్నేళ్ల అకుంఠిత శ్రమ ఉంది. ఆ కథాకమామిషు ఇలా..

అక్షరాల హరివిల్లు

- పరిశుభ్ర వాతావరణంలో బోధనాభ్యసనం
- సాంకేతిక పద్ధతులతో విద్యార్థులకు ప్రత్యక్షానుభూతి
- పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధి

పచ్చని చెట్లతో అలరిస్తున్న మధూడి జడ్పీహెచ్ఎస్

అగళి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధూడి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల ఉత్తమ విద్యాబోధనకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగుతున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 421మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలలో విలువలు, క్రమశిక్షణతో విద్యను నేర్పుతున్నారు. డిజిటల్ తరగతులు, లైబ్రేరీ మ్యాగజైన్లు, ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)తో బోధన ఈ పాఠశాల ప్రత్యేకతలు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడి పిల్లలు అభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు నల్లబల్లలకు బదులు డిజిటల్ బోర్డుపై బోధన చేస్తున్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.





పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహం, పాఠశాల ఆవరణలో చదువుకుంటున్న విద్యార్థులు

అవార్డుతో గుర్తింపు

మధూడి జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ కృషి ఎంతో ఉంది. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధిలో ఆయన ఎంతో శ్రమించారు. దీన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుతో సత్కరించింది. పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్లు, మధ్యాహ్న భోజనం తినడానికి డైనింగ్‌హాల్ ఏర్పాటు చేశారు. గతంలో పని చేసిన హెచ్ఎం సుధాకర్ ఒరవడిని గతనెలలో ఉద్యోగ విరమణ పొందిన హెచ్ఎం దాసేగౌడ్ కొనసాగించారు. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎంఎస్ ప్రభురాజు కూడా పాత హెచ్ఎంల పంథానే కొనసాగిస్తున్నారు.



పాఠశాల ఆవరణలో యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రాథమికోన్నత పాఠశాల నుంచి..

మధూడి పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలగా ప్రారంభమై 1973లో జడ్పీ ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందింది. పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. డిజిటల్ తరగతుల బోధనకు ఇక్కడ పని చేస్తున్న 12మంది ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ పొందారు. తద్వారా వివిధ పాఠ్యాంశాల బోధనలో ఐఎఫ్‌పీ చానల్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రత్యక్షానుభూతితో విద్యార్థులు పాఠ్యాంశాలను చక్కగా అర్థం చేసుకోగలుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రంలో ప్రయోగాలు, ఖగోళ, భౌగోళిక మార్పులు వంటి పాఠాల బోధనలో ఐఎఫ్‌పీ చానల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. ఉత్తమ విద్యాబోధనతో ప్రతి ఏడాది ఈ పాఠశాల విద్యార్థులు ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్ సాధిస్తున్నారు. ఇన్ని సానుకూలతల మధ్య ఏడాదికేడాదికి ఇక్కడ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది కూడా వివిధ ప్రైవేట్ పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు చేరారు.

పచ్చదనం.. పరిశుభ్రత

పాఠశాల ఆవరణమంతా చాలా పరిశుభ్రంగా ఉంటుంది. చుట్టూ పరుచుకున్న పచ్చదనంతో మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. ఇలాంటి వాతావరణంలో గత రెండేళ్ల నుంచి ప్రతి శుక్రవారం విద్యార్థులకు యోగా నేర్పుతున్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, సిద్దలింగప్ప విద్యార్థులకు యోగా నేర్పుతున్నారు. పచ్చదనం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలయ్యాయి.

ప్రయోగాలతో ప్రత్యేక అనుభూతి



ల్యాబ్‌లో ప్రయోగాల ద్వారా కష్టమైన విషయాలను సరళీకృతం చేసి బోధిస్తున్నాం. ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులకు ప్రత్యేక అనుభూతి కలుగుతుంది. క్రమశిక్షణ, పరిశుభ్రత గురించి ప్రత్యేకంగా బోధిస్తున్నాం. విలువలతో కూడిన విద్యనందిస్తూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

- వీరేష్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

మూడేళ్లుగా వందశాతం




ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలను, విద్యార్థులను అని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. పూర్వ విద్యార్థుల సాయంతో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. సాంకేతిక విలువలు జోడించి విద్యను బోధిస్తుండటంతో విద్యార్థులు ఆసక్తిగా పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. గత మూడేళ్లుగా పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాం. ఇదంతా బోధనా సిబ్బంది సహకారం, విద్యార్థులు క్రమశిక్షణతోనే సాధ్యమైంది.

- ఎంఎస్ ప్రభురాజు, హెచ్ఎం

మద్యం ఇక సురక్షితం ..!

- సురక్ష యాప్‌తో నకిలీ, కల్తీ మద్యానికి చెక్
- కొన్నచోటే వినియోగదారుడు పరిశీలించవచ్చు
- స్కాన్ చేయగానే బాటిల్ చరిత్ర ప్రత్యక్షం






సురక్ష యాప్ ద్వారా బాటిల్‌ను స్కాన్ చేస్తున్న అధికారులు, ప్రభుత్వం రూపొందించిన సరికొత్తయాప్

అనంతపురం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యమే వినియోదారుడికి చేరాలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొన్న వెంటనే దుకాణం వద్దే మద్యం చెక్ చేసుకునేందుకు వీలు కల్పించింది. ఈక్రమంలోనే ఓ సరికొత్త యాప్‌ను తీసుకువచ్చింది. దీని ద్వారా వినియోగదారుడు తాను కొనే మద్యం అసలైందా...లేక నకిలీదా అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుంది. యాప్ ద్వారా స్కాన్ చేస్తే చాలు తాను కొన్న లిక్కర్ బాటిల్ సమస్త వివరాలు కస్టమర్ కళ్ల ముందు కనిపించేలా ఈ యాప్‌ను రూపొందించారు. దాని ధర..? ఎక్కడ తయారైంది...?, ఏ బ్రాండ్..? ఏ డిపో నుంచీ సప్లై చేశారు..? ఇలా అన్ని వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ఇదే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్. విపక్షాలు చేస్తున్న నకిలీ మద్యం గగ్గోలుకు, ఇతర ప్రశ్నలకు ఈ యాప్ సమాధానం చెప్పనుంది. ఇది అటు కస్టమర్లు తాము తాగే లిక్కర్ నాణ్యతను తెలుసుకునేందుకు, రిటైల్ దుకాణదారుల అమ్మకాలు తెలుసుకోడానికి ప్రభుత్వం దీన్ని తీసుకొచ్చింది.

సులభంగా వాడొచ్చు

ఎవరైనా ఈ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను సులభంగా వాడొచ్చు. కస్టమర్లు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలి.





విస్కీ బాటిల్, స్కాన్ చేసిన తర్వాత ఆ బాటిల్ వివరాలు

యాప్ ఇన్‌స్టాల్ అవగానే కస్టమర్, రిటైలర్ ఆప్షన్లు చూపుతుంది. కస్టమర్ ఆప్షన్ ఎంపిక చేయాలి. తర్వాత కస్టమర్లు తాము కొనుగోలు చేసే బాటిల్‌పై ఉన్న హీల్ స్టిక్కర్(హాలోగ్రామ్)ను యాప్‌లోని స్కానర్ ద్వారా స్కాన్ చేయగా...కింద సెక్యూరిటీ కోడ్(క్యాప్చా)ను ఎంటర్ చేయగానే ఆ బాటిల్ వివరాలు అన్నీ ప్రత్యక్షం అవుతాయి. ముఖ్యంగా ఆ మద్యం బ్రాండ్ పేరు, ఆ బాటిల్ ఎంఎల్ సైజ్, బ్యాచ్ ఐడీ, దాని ఎమ్మార్పీ , తయారు చేసిన కంపెనీ లోకేషన్ వివరాలు, తయారు చేసిన తేదీ, టైం, అది ఏ లిక్కర్ డిపో నుంచీ సైప్లె చేశారు..? ఏ రిటైల్ దుకాణంలో అమ్మకానికి అందుబాటులో ఉంది...? ఈ వివరాల్లో క్షణాల్లో తెలిసిపోతాయి. ఒక వేళ స్కాన్ చేసినా వివరాలు నాట్ ఫౌండ్ అని లేదా ఇన్‌వ్యాలీడ్ స్టాక్ అని వస్తే....అది నకిలీ మద్యంగా భావించవచ్చు. కస్టమర్లు ఫిర్యాదు చేయకుండానే ఆ వివరాలు ఎక్సైజ్‌శాఖ దృష్టికి వెళ్తాయి. ఈ యాప్ వల్ల కస్టమర్లు నకిలీ, కల్తీ మద్యం పాలు కాకుండా తమను తాము కాపాడుకునేందుకు వీలవుతుంది.

పారదర్శకతకు నిదర్శనం

ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా దాదాపు రూ. 160 కోట్ల నుంచీ రూ. 165 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో రూ.100 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతుంటే మిగతా అమ్మకాలు శ్రీసత్యసాయి జిల్లాలో జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లిక్కర్ 2.40 లక్షల కేసులు, బీర్లు లక్ష నుంచి 1.10 లక్షల కేసులు వరకూ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా కస్టమర్లు తాము కొంటున్న లిక్కర్ నాణ్యతను తెలుసుకోవచ్చు. రిటైల్ దుకాణాదారులు సైతం లిక్కర్ బాటిళ్లను ఈ ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి అమ్మల్సి ఉంటుంది. రిటైల్ దుకాణాల్లో ఎంత మేరకు విక్రయాలు చేశారో....ఎన్ని బాటిళ్ల స్కాన్ చేశారు..? చూసి...స్కాన్ చేసిన బాటిళ్ల మేరకే వాళ్లకు లిక్కర్ డిపోల నుంచీ సప్లై చేస్తారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యాప్ ఎక్సైజ్ శాఖలో పారదర్శకతకు నిదర్శనంగా నిలవనుంది.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



మద్యం అమ్మకాలపై ప్రభుత్వం, సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాలు, బార్లలో నకిలీ మద్యం అమ్ముతు న్నారనే వదంతులు ఎవరూ నమ్మవద్దు. కొందరు పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. కస్టమర్లు దీన్ని మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని వినియోగించుకోవచ్చు. ఇది చాలా సులభవంతం, వేగవంతమైంది.

- నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్, ప్రొహిబిషన్‌శాఖ, ఉమ్మడి అనంతపురం జిల్లా

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి



షేక్ దాదుబాషా (ఫైల్)

ఆస్పరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆస్పరి మండలం నగరూరు బస్ స్టాప్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం నగరానికి చెందిన షేక్ దాదుబాషా(36) మృతిచెందారు. సీఐ గంగాధర్ తెలిపిన మేరకు, షేక్ దాదుబాషా పొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అనంతపురం నుంచి ఆదోనికి బైక్‌పై వెళుతుండగా నగరూరు బస్టాప్ సమీపంలో గుంతను తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. దాదుబాషా భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పీఎంశ్రీ స్కూళ్లకు సౌరవెలుగులు

నిఘాకు సీసీ కెమెరాల ఏర్పాటు

పాఠశాలల్లో ఊపందుకున్న అభివృద్ధి పనులు

రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు సమగ్రశిక్ష ప్రతిపాదనలు



తిమ్మాపురం రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

అనంతపురం విద్య, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంశ్రీ స్కూళ్ల(ప్రైమ్‌మినిస్టర్స్ స్కూల్స్‌ఫర్ రైజింగ్ ఇండియా)కు సోలార్ వెలుగులు అందనున్నాయి. ఈ స్కూళ్లకు 2022లోనే శ్రీకారం చుట్టినా అభివృద్ధి పనులు నత్తనడకన సాగాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అభివృద్ధి పనుల్లో ప్రగతి కనిపిస్తోంది. తాజాగా ఈ స్కూళ్లకు విద్యుత్ బిల్లుల ఖర్చు తగ్గించడంతో పాటు సరఫరాలో సమస్యలు నివారించేందుకు సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయనున్నారు.

టెండర్లు పూర్తి

జిల్లాలో ప్రస్తుతం 42పీఎంశ్రీ స్కూళ్లు ఉన్నాయి. కొత్తగా మరో రెండు మంజూరు చేశారు. ఈ పాఠశాలల్లో సోలార్ సిస్టం ఏర్పాటుకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు ఎస్పీడీ శ్రీనివాసరావు ఇటీవల ప్రకటించారు. దీంతో జిల్లాలో పీఎంశ్రీ స్కూళ్ల వివరాలు, అక్కడ ఎంత సామర్థ్యం విద్యుత్ అవసరం వంటి వివరాలను జిల్లా సమగ్రశిక్ష అధికారులు సేకరించి నివేదికలు పంపారు. ఇప్పటికే పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనికి తోడుగా ప్రతి పాఠశాలకు సీసీకెమెరాల నిఘాను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఏఏ పాఠశాలకు ఎన్ని కెమెరాలు అవసరమవుతాయోననే సమాచారం హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల నుంచి జిల్లా సమగ్రశిక్ష యంత్రాంగం తీసుకొని రాష్ట్ర ఎస్పీడీ ఆఫీస్‌కు నివేదికలు పంపింది.

పీఎంశ్రీ పాఠశాలలు ఇవే..

జిల్లాలో ఆత్మకూరు జడ్పీహెచ్‌ఎస్(ఆత్మకూరు), రాప్తాడు జడ్పీహెచ్‌ఎస్(రాప్తాడు), గార్లదిన్నె జడ్పీహెచ్‌ఎస్(గార్లదిన్నె), ఎన్.గుండ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్(బెళుగుప్ప), బొమ్మనహాళ్ జడ్పీహెచ్‌ఎస్(బొమ్మనహాళ్),మురడి జడ్పీహెచ్‌ఎస్(డీ.హీరేహాళ్), ఖాదరపేట జడ్పీహెచ్‌ఎస్(పామిడి), గవర్నమెంట్ ఉన్నతపాఠశాల (పామిడి), లక్ష్మపల్లి జడ్పీ హెచ్‌ఎస్(పెద్దవడుగూరు), రాయలచెరువు జడ్పీహెచ్‌ఎస్(యాడికి), ఎనుములదొడ్డి జడ్పీహెచ్‌ఎస్(కుందిర్పి), తిమ్మంపల్లి జడ్పీహెచ్‌ఎస్(యల్లనూరు), తరిమెల జడ్పీ హెచ్‌ఎస్(శిగనమల), చుక్కలూరు జడ్పీహెచ్‌ఎస్(తాడిపత్రి), జేసీఎన్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల (తాడిపత్రి), విడపనకల్లు జడ్పీహెచ్‌ఎస్(విడపనకల్లు), పెద్దపప్పూరు జడ్పీహెచ్‌ఎస్(పెద్దపప్పూరు), కడవకల్లు జడ్పీహెచ్‌ఎస్(పుట్లూరు)గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్(రాయదుర్గం), పాతకొత్తచెరువు జడ్పీహెచ్‌ఎస్(గుంతకల్లు), కంబదూరు జడ్పీహెచ్‌ఎస్(కంబదూరు), బ్రహ్మసముద్రం, రజాపురం, బీ.పప్పూరు, కురుగుంట, గుత్తి, తిమ్మాపురం(ఏపీడబ్ల్యూఆర్ పాఠశాలలు), గార్లదిన్నె, కళ్యాణదుర్గం, పామిడి, రాయదుర్గం,శెట్టూరు, వజ్రకరూరు(మోడల్‌స్కూల్స్), పాలవాయి, ఉదిరిపికొండ, కొంతనపల్లి(ఎంపీయూపీస్కూల్స్) ఈ పాఠశాలలో త్వరలో సోలార్‌వెలుగులు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు కానున్నాయి.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా: శైలజ, సమగ్రశిక్ష ఏపీసీ

పీఎంశ్రీ స్కూళ్లు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారనున్నాయి. ఇప్పటికే ప్రతిపాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే ల్యాబ్స్ కంప్యూటర్లు, మైదానాలు, కిచెన్‌గార్డులు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాం. తాజాగా సోలార్‌సిస్టమ్, సీసీకెమెరాల ఏర్పాటుకు ఎస్పీడీ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఒక్కో స్కూల్‌కు రూ.1.5 లక్షలు ఇచ్చారు. సోలార్ ఏర్పాటుకు రాష్ట్రస్థాయిలోనే టెండర్లు నిర్వహించారు.



పీఎంశ్రీ బుక్కరాయసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరి పంటలో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. బోర్లు, చెరువులు, హెచ్చెల్సీ ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటను సుడిదోమ, పలు రకాల తెగుళ్లు ఆశించడంతో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. బీపీటీ-5204, ఎంటీయూ-1010 రకాలకు దోమపోటు ఎక్కువగా ఉంటుందన్నారు. యూరియాను ఒకేసారి కాకుండా మూడు దఫాలుగా వాడాలన్నారు. దోమపోటు నివారణకు బుప్రోఫెజిన్ 75 శాతం, ఫైమెట్రోజిన్‌గానీ, డైనటోఫ్యూరాన్‌గానీ 0.3 నుంచి 0.4 గ్రాములు నీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలి బాటను ఏర్పాటు చేయడం ద్వారా దోమపోటు ఉధృతి తగ్గే అవకాశం ఉందన్నారు. అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు, ప్రొపికొనజోల్ 2 మిల్లీలీటర్లుగానీ, హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పక్షం రోజులకోమారు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆలస్యంగా జూలై ఆఖరు, ఆగస్టు మొదటి వారంలో సాగుచేసిన వేరుశనగ పంటకు లేత, ముదురు ఆకుమచ్చ తెగులు కనిపించిన వెంటనే 400 గ్రాములు మాంకోజెబ్ గానీ, 200 గ్రాములు కార్బండిజమ్‌గానీ, 400 గ్రాములు క్లోరోథలోనిల్‌గానీ, 400 గ్రాములు హెక్సాకోనజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

259 పీజీ సీట్లు భర్తీ

అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 259 పీజీ సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్ గ్రూపులో 187, ఆర్ట్స్ గ్రూపుల్లో 72 మంది చొప్పున విద్యార్థులు అడ్మిషన్ పొందారు. గత నెల చివరి వారంలో మెదటి విడత పీజీ అడ్మిషన్లు నిర్వహించారు. ఇందులో 213 మంది అడ్మిషన్ పొందారు. సైన్స్ 157 మంది, ఆర్ట్స్‌లో 56 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. ఈనెల 13నుంచి 15వ తేదీ వరకు రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. ఇందులో 46 మంది అడ్మిషన్ తీసుకున్నారు. సైన్స్‌లో 30 మంది, ఆర్ట్స్‌లో 16 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. రెండు విడతల్లో కలిపి మొత్తం 259 మంది అడ్మిషన్ తీసుకున్నారు. త్వరలోనే మూడో విడతగానీ, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపటనున్నారు. తద్వారా మరింత మంది అడ్మిషన్ పొందే వీలుందని వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

నేడు, రేపు ప్రాంగణ నియామకాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర, శనివారాల్లో ప్రాంగణ నియామకాలు చేపట్టనున్నట్లు శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2020-2025 మధ్య పాసవుట్ బ్యాచ్‌లకు చెందిన బీటెక్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన వారు పాల్గొనవచ్చన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 18న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ రామచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. సీఎస్ఈ, సీఎస్ఎం, సీఎస్‌డీ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణయించిన ఫీజుతో ఉదయం 10 గంటలకు కళాశాలకు రావాల్సి ఉంటుందన్నారు.

30న భగవద్గీత కంఠస్థ పోటీలు

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30న స్థానిక టీటీడీ కల్యాణమండపంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు, పది నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు, 18 ఏళ్లు పైబడిన వారికి వేర్వేరు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతి విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తిగలవారు 92923 25020 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఖజానా శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఖజానా శాఖ ఉప సంచాలకుడి(డీడీ)గా రమణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని ఖజానా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఇదివరకు ఇన్‌చార్జిగా కడప ట్రెజరీ డీడీ వెంకటేశ్వర్లు కొనసాగారు. డీడీగా బాధ్యతలు చేపట్టిన రమణయ్యకు ఏటీఓ రాణి, అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి విలేకరులకు శిక్షణ తరగతులు

రాయదుర్గం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రెండురోజుల పాటు అనంతపురం జిల్లా గ్రామీణ విలేకరులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ అయూబ్ తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని తృప్తి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగే శిక్షణా తరగతులకు క్రైమ్ రిపోర్టింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రామీణ వార్తల సేకరణ, డెస్క్‌తో సమన్వయం లాంటి అంశాలపై రెండురోజుల పాటు తరగతులు ఉంటాయన్నారు. జర్నలిజంలో నిష్ణాతులైన వారితో తరగతులు చెప్పిస్తామని, గ్రామీణ విలేకరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1875 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ హెచ్‌ఎం మృతి



అనంతపురం విద్య, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అనంతపురంరూరల్ పరిధిలోని విద్యారణ్యనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితమ్మ (60) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్కూల్ టీచర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లలితమ్మ కుటుంబం నగరంలోని మూడోరోడ్డులో నివాసం ఉంటోంది. ఈనెల 11వ తేదీన ఓ ఫంక్షన్‌కు భర్తతో కలిసి లలితమ్మ ద్విచక్రవాహనంలో రాంనగర్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చే సమయంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద కుదుపునకు లలితమ్మ కింద పడిపోయి, తలకు గాయమైంది. ఆమెను బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న ఆ స్కూల్ టీచర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కణేకల్లుమండలం యర్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీల్లో లలితమ్మ విద్యారణ్యనగర్ ఉన్నత పాఠశాలకు వచ్చారు. హెచ్‌ఎం మృతిపట్ల డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఎంఈఓ వెంకటస్వామి, హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జయరామిరెడ్డి సంతాపం తెలిపారు.

ఆటో బోల్తా.. విద్యార్థి మృతి

పెనుకొండ రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హరిపురం వై జంక్షన్ వద్ద ఆటో బోల్తాపడి ఇర్షాద్(11) అనే 5వ తరగతి విద్యార్థి మృతిచెందాడు. ధర్మవరం రాజేంద్రనగర్‌కు చెందిన తొమ్మిది మంది ఆటోలో పెనుకొండ దర్గాకు వస్తుండగా వై జంక్షన్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇర్షాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. దిల్షాద్, మెహరీన్, షబ్రీన్, తదితరులు గాయపడ్డారు. వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదని..

పెనుకొండ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తన చదువుకు తగిన ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో రైల్వే గేట్‌మన్ లోకేష్(29) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లోకేష్ గేట్‌మన్‌గా పని చేస్తూ పెనుకొండ రైల్వే క్వార్టర్స్‌లో 2022 నుంచి ఉంటున్నాడు. ఏడాదిన్నర కిందట రాజస్థాన్‌లోని తన స్వగ్రామంలో హారతిబాయిమీన అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి రైల్వే క్వార్టర్స్‌లో ఉండేవారు. రెండు నెలల కిందట భార్యను పండుగ కోసం రాజస్థాన్‌లో వదిలివచ్చాడు. అయితే తాను బీటెక్ చదివానని, పలుమార్లు పలు ఉద్యోగాలకు పోటీపరీక్షలు రాసినా అనుకున్నది సాధించలేకపోయినట్లు చుట్టుపక్కల వారితో తరచూ చెబుతూ బాధపడేవాడు. ఈ వేదనతో తీవ్రంగా కుంగిపోయిన లోకేష్ బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. డ్యూటీ షిఫ్ట్‌కు రాకపోవడంతో తోటి సిబ్బంది లోకేష్ సెల్‌కు పలుమార్లు ఫోన్‌చేశారు. స్పందన లేకపోవడంతో అనుమానంతో ఇంటివద్దకు వచ్చి పరిశీలించారు. వారికి ఉరికి వేలాడుతున్న లోకేష్ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆచూకీ తెలపండి

అదృశ్యమైన మహిళ కుటుంబికుల మొర



లీలాబాయి

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాకు చెందిన లీలాబాయి ఆచూకీ తెలపాలని ఆమె కుటుంబసభ్యులు.. గురువారం పోలీసుల వద్ద మొరపెట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నాగస్వామిని కలిసి, విన్నవించుకున్నారు. రూపానాయక్ తండాకి చెందిన హేమ్లానాయక్, లీలాబాయి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హేమ్లానాయక్ అనారోగ్యం బారిన పడడంతో లీలాబాయి కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె కనిపించకుండా పోయింది. దీంతో దసరా పండుగకు పుట్టింటికి వెళ్లి ఉంటుందని కుటుంబికులు భావించారు. పండుగ తర్వాత కూడా ఇంటికి రాకపోవడంతో వారం రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో లీలాబాయి ఆచూకీ తెలపాలని ఆమె కుటుంబికులు, బంజారా సంఘం నాయకుడు కేశవనాయక్.. ఎస్ఐని కోరారు. దీనిపై ఎస్ఐని అడగ్గా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వార్డెన్ ఠాగూర్ గుండెపోటుతో మృతి



రవీంద్రనాథ్ ఠాగూర్ (ఫైల్)

అనంతపురం విద్య, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్ ఠాగూర్ (59) గుండెపోటుతో గురువారం మరణించారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు బీసీ బాలుర డీఎన్‌టీ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న ఆయన గురువారం హెల్త్ చెకప్ కంటూ ఉదయం బెంగళూరుకు బస్సులో వెళ్లారు. దేవనహళ్లి సమీపంలోకి వెళ్లగానే ఛాతీలో నొప్పి తీవ్రం కావడంతో బస్సు దిగేశాడు. అక్కడే పడిపోయాడు. స్నేహితుడు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. మొబైల్‌లో లొకేషన్ పెట్టుకుని వెళ్లి చూడగా.. అప్పటికే ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడికెళ్లగానే ఠాగూర్ మరణించారని ఆయన స్నేహితుడు, ఇతర వార్డెన్లు తెలిపారు. ఠాగూర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి బీసీ సంక్షేమ డీడీ ఖుష్బూకొఠారి, ఏబీసీడబ్ల్యూఓలు, వార్డెన్ల సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

విశ్వాసం ఉండేనా ?

బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం

ఈనెల 30న అత్యవసర సమావేశం

ఎంపీపీ దాసరి సునీతను దించేందుకు వైసీపీ యత్నం



దాసరి సునీత



నాగలక్ష్మి

బుక్కరాయసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం అయ్యింది. తమ పార్టీకే చెందిన ప్రస్తుత ఎంపీపీ దాసరి సునీతను పదవి నుంచి దింపేందుకు వైసీపీ నాయకులు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న బీకేఎస్ ఎంపీడీఓ కార్యాలయంలో అత్యవసరం సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. పది రోజుల కిందట 13 మంది వైసీపీ ఎంపీటీసీలు అనంతపురం ఆర్డీఓను కలిసి ఎంపీపీ సునీతపై ఆవిశ్వాస తీర్మాన పెట్టడానికి వినతి పత్రం ఇచ్చారు. ఆమేరకు ఈనెల 30న అవిశ్వాస తీర్మానం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్డీఓ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండల రాజకీయం వేడెక్కింది.

ఇదీ రాజకీయ పరిస్థితి...

మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... 14 స్థానాల్లో వైసీపీ, 5 స్థానాల్లో టీడీపీ గెలుపొందింది. బుక్కరాయసముద్రం ఎంపీటీసీ -2 గా వైసీపీ నుంచి గెలుపొందిన దాసరి సునీతను ఎంపీపీగా వైసీపీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈమెకు తొలుత రెండున్నర సంవత్సరాల కాలం, మిగిలిన కాలం బుక్కరాయసముద్రం ఎంపీటీసీ -1 గెలుపొందిన కాలువ నాగలక్ష్మికి ఇవ్వాలని పార్టీ ఒప్పందం కుదిర్చింది. వైసీపీలో జరిగిన గ్రూపు విభేదాలు కారణంగా ఎంపీపీ దాసరి సునీత రెండున్నరేళ్ల తర్వాత కూడా తన పదవికి రాజీనామా చేయలేదు. 2024 ఎన్నికల ముందు ఎంపీపీ దాసరి సునీత టీడీపీలోకి చేరారు.

ఎంపీటీసీలతో టీడీపీ, వైసీపీ నేతల భేటీ

ఎంపీపీపై అవిశ్వాసానికి తేదీ ఖరారు కావడంతో టీడీపీ, వైసీపీలు రాజకీయ సమీకరణాల్లో నిమగ్నమయ్యాయి. పదవిని కాపాడుకునేందుకు ఎంపీపీ దాసరి సునీత, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ సహకారంతో ముందుకు సాగుతున్నారు. ఈక్రమంలోనే గురువారం మండలంలోని నల్గురు టీడీపీ ఎంపీటీసీలుతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడినట్లు తెలిసింది. అప్రమత్తమైన వైసీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ 13 మంది ఎంపీటీసీలకు తన తోటలో శుక్రవారం విందు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. విందులో దిశ నిర్దేశం చేసి, వైసీపీకే ఓటువేయాలని చెప్పే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసీపీకు బలం ఉంది. గెలిచిన 14 మంది ఎంపీటీసీల్లో దాసరి సునీత పోగా... 13 మంది ఉన్నారు. టీడీపీలో ఆరుగురే ఎంపీటీసీలు ఉంటారు. అవిశ్వాసం వీగిపోవాలంటే టీడీపీకి మరో నలుగురు సభ్యుల మద్దతు కావాల్సి ఉంది. వైసీపీ తరఫున పదవిని ఆశిస్తున్న చికెన్ నారాయణస్వామి భార్య కాలువ నాగలక్ష్మి ఇప్పటికే వైసీపీ ఎంపీటీసీలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా పలు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలును (నంబర్ 07497) ఈ నెల 17న, దీని తిరుగు ప్రయాణపు రైలును (07498) 18న నడుపుతారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, సూలేహళ్లి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది. అదే విధంగా షోలాపూర్-ధర్మవరం ప్రత్యేక రైలును (01437) ఈ నెల 16న, దీని తిరుగు ప్రయాణపు రైలును (01438) ఈ నెల 18న నడుపుతారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్, లాతూరు, లాతూరు రోడ్, ఉద్గిర్, భల్కి, బీదర్, వికారాబాద్, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, మెలకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరానికి చేరుకుంటుంది. దర్భంగా-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (05541) ఈ నెల 20వ తేదీ నుంచి నవంబరు 17వ తేదీ వరకూ సోమవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (05542) ఈ నెల 23 నుంచి నవంబరు 20వ తేదీ వరకూ గురువారాలలో నడుస్తుంది. ఈ రైలు సమస్తిపూర్, ముజఫ్ఫర్ నగర్, హాజీపూర్, సోనాపూర్, చాప్రా గ్రామీణ్, చాప్రా, సివన్, డోరియా సదర్, గోరఖ్‌పూర్, గోండా, బారాబన్కి, ఐష్‌బాగ్, కాన్పూర్ సెంట్రల్, ఓరాయ్, రామగుండం, ఖాజీపేట, కాచిగూడ, మహబూబ్‌నగర్, డన్, ధర్మవరం, హిందూపురం, యల్హంక స్టేషన్లమీదుగా ప్రయాణిస్తుంది.

ఆలయాల అభివృద్ధే ధ్యేయం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

బాబా విగ్రహానికి వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్

తాడిపత్రి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలయాలను అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని, రాయలసీమలోనే తాడిపత్రిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న శివసాయిమందిరంలో గురువారం ఆయన వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సర్టిఫికెట్‌ను వరల్డ్ రికార్డ్ ఇండియా అండ్ జీనియస్ ఫౌండేషన్ అధ్యక్షుడు పవన్ సోలంకి, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అందజేశారు. ఒకే మార్బుల్ రాయితో 9.5అడుగుల ఎత్తుతో, 7టన్నుల బరువుతో మందిరంలోని సాయినాథుడి విగ్రహాన్ని చెక్కించారు. దీన్ని గుర్తించిన సంస్థ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాయినాథుడి విగ్రహానికి వరల్డ్ రికార్డ్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సాయిబాబా మందిరాన్ని నిర్మించాలని అనుకున్న సమయంలో సాయినాథుడి విగ్రహం ఎంతో విశేషంగా మరెక్కడా లేనివిధంగా ఉండాలని ఆలోచించానన్నారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన ఒకే ఒక్క మార్బుల్ రాయిలో బాబాను చెక్కించినట్లు తెలిపారు. ఏడాదిన్నర కిందట మందిరాన్ని ప్రారంభించి పూజలు చేస్తున్నామన్నారు. ఇప్పుడు ప్రపంచస్థాయిలో సర్టిఫికెట్ రావడం తనతోపాటు తాడిపత్రి ప్రజలకు ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, ఎంఏ రంగారెడ్డి, అరవిందనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలనకు చెక్..!

ఉద్యోగోన్నతుల ద్వారా ఎంపీడీఓ ఖాళీల భర్తీకి చర్యలు

కమిషనరేట్‌లో కసరత్తు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎంపీడీఓ ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఇన్‌చార్జిల పాలనకు చెక్ పడనుంది. రెగ్యులర్ ఎంపీడీఓలతో ప్రజాసమస్యలకు పరిష్కారం దక్కనుంది. ఉమ్మడి జిల్లాలో 10 మండలాల్లో రెగ్యులర్ ఎంపీడీఓలు లేక ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగోన్నతుల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇన్‌చార్జిల పాలన ఉన్న స్థానాల్లో రెగ్యులర్ అధికారిని నియమించేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా 4 మండలాల్లో సీనియర్ డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉన్నవారికి ఉద్యోగోన్నతి కల్పించి, ఎంపీడీఓలుగా నియమించడానికి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో కసరత్తు చేస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారుల సమాచారం. కూడేరు, గార్లదిన్నె, వజ్రకరూరు, బొమ్మనహాళ్‌లో డిప్యూటీ ఎంపీడీఓలుగా పనిచేస్తున్న వారు ఉద్యోగోన్నతి జాబితాలో ముందు వరుసలో ఉన్నట్లు తెలిసింది. ఈ నెలలోనే జాబితా విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలోని మరికొంత మంది డిప్యూటీ ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతుల ఫైల్ సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో ఇన్‌చార్జిల పాలనకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకనుంది. అన్ని స్థానాల్లో రెగ్యులర్ అధికారులను నియమించేందుకు చర్యలు చేపడుతోంది.

న్యూస్ బాక్స్

మహిళా భక్తులకు పనిముట్లు పంపిణీ



పనిముట్లతో మహిళా భక్తులు

పుట్టపర్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు చెందిన శివం భక్తులు గురువారం మహిళా భక్తులకు అవసరమైన గ్రైండర్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాదుకు చెందిన శివం భక్తులు పర్తియాత్ర పేరిట గురువారం ప్రశాంతి నిలయా నికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ హాలులో భక్తి గీతాలాపన చేపట్టారు. సత్యసాయి శతవర్ష యజ్ఞం పేరిట చేపట్టిన భక్తి గీతాలు భక్తులను అలరింపజేశాయి. 300 మంది మహిళా భక్తులకు కుట్టుమిషన్లు, గ్రైండర్లు పంపిణీ చేశారు. అనంతరం వారు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

26న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 26న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ పట్టణ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో ఉచిత వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. స్థానిక కొత్తపేట ఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

అంధకారంలో కాలనీలు

నల్లచెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నల్లచెరువులోని పలు కాలనీలు వీధి దీపాలు లేక అంధకారంలో ఉన్నాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగా నూరుద్దీన్ కాలనీ, బస్టాండ్ సర్కిల్, ఓరువాయి రోడ్డులోని ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. వీధి దీపాలు లేక రాత్రిపూట సంచారానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో చిట్టడవిని తలపించే ముళ్ల చెట్లలో పాములు ఎక్కువ ఉండడంతో కాలనీ వాసులు వణికిపోతున్నారు. అధికారులు దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకొచ్చినప్పటికి ఫలితం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

ఏమిటీ దుస్థితి..?

- అందుబాటులో లేని 108 వాహనాలు
- ఇబ్బందుల్లో ప్రమాద బాధితులు
- ఆటోలో తరలిస్తుండగా ప్రసవం.. బిడ్డ మృతి

తనకల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తనకల్లులో 30 పడకల ఆసుపత్రి ఉంది. కానీ రెండు నెలలుగా 108 అంబులెన్సు అందుబాటులో లేదు. దీంతో ఆసుపత్రికి వచ్చేందుకు రోగులు, గర్భిణులు, ప్రమాద బాధితులు ప్రైవేటు వాహనాలు, ఆటోలపై ఆధారపడుతున్నారు. గతంలో తనకల్లులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలోనే 108 వాహనం అందుబాటులో ఉండేది. 108కి ఫోన్ చేస్తే వెంటనే ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించేవారు. 108 వాహనం మరమ్మతులకు రావడంతో నెల రోజులుగా అందుబాటులో లేదని సంబంధిత అధికారులు అంటున్నారు. కానీ రెండు నెలలుగా అందుబాటులో లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మండలంలో వందే మాతరం టీం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌కు బాధితులు ఫోన్ చేస్తున్నారు. బుధవారం మండలంలోని జామ్లానాయక్ తండా వాసులు 108 వాహనానికి ఫోన్ చేశారు. తమ గ్రామానికి చెందిన శారద పురిటి నొప్పులతో బాధపడుతోందని సమాచారం ఇచ్చారు. 108 వాహనం అందుబాటులో లేదని, కదిరి నుంచి వస్తుందని చెప్పడం తో గర్భిణీని ఆటోలో తీసుకువచ్చారు. మార్గమధ్యలోనే ప్రసవించి.. శిశువు కూడా మృతి చెందింది. త ర్వాత 108 వాహనం వచ్చి తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది.

స్పందించడం లేదు



మా గ్రామానికి చెందిన శారద బుధవారం పురిటినొప్పులతో బాధపడుతుండడంతో 108కి ఫోన్ చేశాం. కదిరి నుంచి వాహనం వస్తుందన్నారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయలేదు. దీంతో విధిలేని పరిస్థితిలో ఆటోలో ఆసుప్రతికి తీసుకువస్తుండగా మార్గంమధ్యంలోనే ప్రసవించి బిడ్డ చనిపోయింది.

- బి. రమేష్‌నాయక్, జామ్లానాయక్ తండా

వాహనం రిపేరీలో ఉంది



గత రెండు నెలలుగా 108 వాహనం రిపేరీలో ఉన్నమాట వాస్తవమే. ఇంజన్ మరమ్మతుల కారణంగా అనంతపురంలో వదిలి వచ్చాం. తరువాత వాహనం అందుబాటులో ఉంది. బుధవారం జామ్లానాయక్ తండా విషయంలోకూడా మాకు ఫోన్ వచ్చిన వెంటనే బయలుదేరి వెళ్లి మార్గమధ్యం నుంచి తీసుకు వచ్చాం. అప్పటికే శిశువు మృతి చెందింది.

- మధుసూదన్‌రెడ్డి , ఈఎంటీ, 108

ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

తమ బిడ్డ(శిశువు) మృతి చెందడానికి ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు శారద, శివనాయక్, బంధువులు ఆరోపించారు. ప్రతినెలా గ్రామానికి వచ్చి పరీక్షలు నిర్వహించాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సక్రమంగా రాలేదని తెలిపారు. కాన్పు సమయం ఎప్పుడో కూడా చెప్పలేదని అన్నారు. బుధవారం నొప్పులు రావడంతో 108 వాహనానికి ఫోన్‌చేయగా అందుబాటులో లేదని, అందువల్లే ఆటోలో తీసుకువచ్చామన్నారు. ఆటోలో వస్తుండగానే మార్గమధ్యలో కాన్పు కావడంతో శిశువు మృతి చెందినట్లు తెలిపారు.



శారద నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఈఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

మా తప్పు ఏమీ లేదు..

శిశువు మృతి చెందిన విషయంలో తమ తప్పు ఏమీ లేదని ఎంఎల్‌హెచ్‌పీఓ, ఏఎన్ఎం తెలిపారు. ఈ నెల 21న డెలివరీ సమయం ఉందన్నారు. ముందుగానే నొప్పులు రావడంతో ప్రమాదం సంభవించిందని తెలిపారు. తమకు కూడా విషయం తెలియజేయలేదని, తెలిసి ఉంటే స్పందించేవాళ్లమని వివరించారు.

ఆరా తీసిన డీఎంహెచ్ఓ

మహిళ ఆటోలో ప్రసవించిన విషయంపై డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం గురువారం తనకల్లుకు వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శారద వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్వరం వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

ప్రభుత్వ భూములను పరిశీలించిన తహసీల్దార్

ఓబులదేవరచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుకుంటపల్లి వరదరాజుల ఆలయ ఆవరణంలో సర్వే నెంబర్ 267-1 లో ఉన్న ప్రభుత్వ భూములను బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప రి శీలించారు. ఈ భూముల్లో నిరుపేదలైన ఎస్సీలకు సాగు భూమిపట్టా ఇవ్వాలని కోరుతూ ఇటీవల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప గ్రీవెన్స్‌లో కలెక్టర్, ఆర్డీఓకు విన్నవించారు. దీనిపై స్పందించిన అధికారుల అదేశాల మేరకు తహసీల్దార్ భూములను పరిశీలించారు. భూముల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

'కందికుంటను విమర్శించే స్థాయి లేదు'

తనకల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను విమర్శించే స్థాయి, అర్హత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి లేదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దుల కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యేగా ఆయన ఏమేమీ చేశాడో అందరికీ తెలుసు అన్నారు. పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యనే ఉండి, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేసే కందికుంటపై విమర్శలు చేస్తే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. జగనన్న ఇళ్లలో ఆయన చేసిన అవినీతిని ఆ నియోజకవర్గ ప్రజలు మరిచిపోలేదని గుర్తు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం ఉదయం 8-30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఏఈ జువేద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కదిరిగేటు వద్ద ఆర్అండ్‌బీ అధికారులు పనులు చేస్తున్నారని, మార్కెట్‌యార్డ్ వద్దగల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల చేస్తున్నామని వివరించారు. దీంతో పట్టణంలోని శాంతినగర్, శారదనగర్, చంద్రబాబునగర్‌లో సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ మాట్లాడుతూ.. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని తెలిపారు.

పక్కాగా సమిత్వ సర్వే : ఆర్డీఓ

కొత్తచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సమిత్వ సర్వేను పక్కాగా నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఆర్డీఓ సువర్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్రామ కంఠాలు, శ్రోత్రియం, మాన్యం భూములలో ఉన్న లబ్ధిదారులను పక్కాగా గుర్తించి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాంజనేయులు, మండల సర్వేయర్ సురేష్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఉపశమనం

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు ఉపశమనం కల్గించిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాణి తెలిపారు. గురువారం పుట్టపర్తి అసిస్టెంట్ కమిషనర్ మెరువ చందు, ధర్మవరం ఆర్టీఓ రాణి ఆధ్వర్యంలో జీఎస్టీపై ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు, మోటార్ వెహకల్స్ ఉపయోగించేవారికి, వ్యవసాయ, వ్యాపార రంగాలకు కేంద్ర ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తనకల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లగుట్లపల్లి సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన సురేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్రవాహనంలో వెళ్లి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలపాలైన సురేష్‌ను 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు బంధువులు తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

బుక్కపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అండర్-19 రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు బుక్కపట్నం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జగదీశ్ తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నరేంద్ర, విష్ణువర్ధన్ అండర్-19విభాగంలో అనంతపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని గురువారం పాఠశాలలో హెచ్ఎంతోపాటు పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

కదిరి అర్బన్, అక్టోరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ ఫైరోజ్ బేగం గురువారం ఆకస్మికంగా తనిఖీ చుశారు. రికార్డులను పరిశీలించి, ఓపీ సేవలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ సేవలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించి, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేంద్ర నాయక్, డాక్టర్ జోష్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● గాండ్లపెంట : గ్రామీణ ప్రాంతవాసులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వారికి సేవలందించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాల బాధితులకు అవసరమయ్యే ప్రథమ చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రనాయక్, వైద్యసిబ్బంది నగేష్, విజయ్, కిరణ్, శారద, ఇందిరా పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. గురువారం కొత్తపేటలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు చేసి ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.43,120, రెండు సెల్‌ఫోన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

● అమడగూరు : మండల పరిధిలోని పూలకుంటపల్లి వద్ద గురువారం పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 7,400 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ఓబులదేవరచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ మంజుల, ఈసీ షేక్షావలీ, గ్రామ కార్యదర్శి శంకరప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో చోరీ

కొత్తచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పూజారివీధిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు శాంతమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఆమె కదిరిలోని కుమార్తె ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లింది. దొంగలు ఇంటికి వేసిన తాళాలను, సీసీ కెమెరాలను పగలకొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాలో ఉంచిన ఉంగరం, బ్రాస్‌లైట్ మొత్తం 20 గ్రాముల బంగారు ఎత్తుకెళ్లినట్లు ఆమె తెలిపారు. ఇంటిలో ఉన్న మరో సీసీ కెమెరాలో ఫుటేజ్ రికార్డు అయిందని, ఆ మేరకు పరిశీలించి దొంగలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● బుక్కపట్నం : మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. బుధవారం రాత్రి ఆంజనేయస్వామి ఆలయంలోకి దొంగలు ప్రవేశించి హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. ఆలయ పూజారి పోలీసులు ఫిర్యాదు చేశారు.

రోడ్డుపైకి మురుగునీరు రాకుండా చర్యలు



మురుగును తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

కొత్తచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆర్డీఓ సువర్ణ ఆదేశించారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని వేణుగోపాల్ నగర్‌లో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం 'వాననీరు కాదు.. మురుగునీరే' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ బాలాంజనేయులు, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ రెడ్డితో కలిసి వేణుగోపాల్‌నగర్‌లో పర్యటించారు. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని, ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా దారిలేదని కాలనీ వాసులు విన్నవించారు. రోడ్డుపై మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఈఓఆర్డీని ఆదేశించారు. పంచాయతీ కార్మికులు తాత్కాలిక డ్రైనేజీ పనులు చేపట్టి మురుగునీరు రోడ్డుపై పారకుండా పనులు చేపట్టారు.

రూ.63 లక్షలతో అభివృద్ధి పనులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆసుపత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. రోగుల సౌకర్యార్థం అవసరమైన పరికరాల కొనుగోలుకు సీఎస్ఆర్ ఫండ్ కింద రూ.63 లక్షల నిధులు మంజూరు చేయాలని ఆమోదించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ చెన్నారెడ్డి, ఏఓ ఉదయ్‌భాస్కర్, డాక్టర్లు నరసింహులు, సోనియా, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

ధర్మవరంరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో నిర్వహిస్తామని అన్నారు. ఖోఖో, కబడ్డీ, యోగా, చెస్, షటిల్, వాలీబాల్ క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. కోఆర్డినేటర్లుగా పీడీలు స్వరూప, సరళ వ్యవహరిస్తారన్నారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని తెలిపారు.

ప్రతి ఇంటి వద్ద మొక్కను నాటుదాం

నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు



మొక్కలు నాటుతున్న చైర్మన్ తదితరులు

మడకశిరటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి వద్ద మొక్కను నాటి పరిరక్షించాలని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. గురువారం స్థానిక బీసీ హాస్టల్ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిఇంటికి మొక్కను సరఫరా చేస్తామని, దానిని పరిసరాల్లో నాటి సంరక్షించాలన్నారు. అప్పుడు పట్టణం నందనవనంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ, ఫారెస్టు శాఖ అధికారులు, కమిషనర్ జగన్నాథ్, మెప్మా సీఈఓ నాగేశ్వరి, శానిటేషన్ సిబ్బంది మొక్కలు నాటారు.

'పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలి'

రొద్దం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పార్టీకోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య పిలుపునిచ్చారు. గురువారం రొద్దం టీడీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లు, డీలర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమౌళి, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, రామచంద్ర, కన్వీనర్ నరహరి, సిద్దన్న, అశ్వర్థనారాయణ, చిరంజీవి, మురళి, మండల ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ పాల్గొన్నారు.

26న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 26న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ పట్టణ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో ఉచిత వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. స్థానిక కొత్తపేట ఉషోదయ ఇంగ్లీషుమీడియం స్కూల్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు

ఇబ్బందుల్లో ప్రజలు



వి. అగ్రహారం సచివాలయం

అమరాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదని, దీంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉదయం పది గంటలకురావాల్సిన సిబ్బంది 11.30 అయినా రావడంలేదని అంటున్నారు. మండల పరిధిలో 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అందులో 130 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే సచివాలయాల నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు అధికంగా రెవెన్యూ, సర్వే, పశుసంవర్ధక పంచాయతీ కార్యదర్శుల కోసం సచివాలయాలకు వస్తుంటారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని వారు అంటున్నారు. సచివాలయాలకు రావడం, అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతుమని చెబుతున్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఉదయం 10గంటలకు రావాల్సిన సిబ్బంది 11-30కు రావడం జరుగుతోందని, ఏది ఏమైనా అధికారుల పర్యవేక్షణ లోపంతోనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సచివాలయాలపై పర్యవేక్షణ చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ రామారావును వివరణ కోరగా సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాహనాలపై సూపర్ సేవింగ్స్



వాహన మేళాను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాహనాలపై జీఎస్టీ తగ్గించడంతో వాహన యజమానులకు సూపర్ సేవింగ్ అవుతుందని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర అన్నారు. గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో చర్చి గ్రౌండ్‌లో సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లపై జీఎస్టీ తగ్గడంతో కొత్త వాహనాలు కొనేవారికి ఎంత ధర తగ్గుతుందో వాహనాల షోరూమ్ యజమానులు వివరించారు. ప్రతి వాహనంపై ధర తగ్గిందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ కరుణాసాగర్‌రెడ్డి, ఎంవీఐలు ఉదయ్, జయలక్ష్మీ, స్వాతి, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ ఇర్షాద్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, రామాంజినమ్మ, అజ్మతుల్లా, ఇందాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: సూపర్‌జీఎస్‌టీ, సూపర్‌సేవింగ్స్‌పై శుక్రవారం ఇంటింటి ప్రచారం ఉంటుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. సూపర్‌జీఎస్‌టీ ద్వారా పేద ప్రజలకు జరుగుతున్న మేలును వివరించడానికి ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

పెనుకొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్ తెలిపారు. గురువారం జీఎస్‌టీ తగ్గుదలపై ఇంటింటికి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. పట్టణంలోని 6,7, 8వార్డుల్లో కాలనీల్లో తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ఎన్డీఏ అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలు, మంత్రి సవిత చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, బండ్లనూర్, అస్లాంబాషా, షౌకత్, షమున్, బర్కత్, నజీర్, షఫీ, అబ్దుల్లా, త్రివేంద్రనాయుడు, రామలింగ, చంద్రకాంతమ్మ, జనసేన శ్రీదేవి, నారాయణ నాయక్, బాబిరెడ్డి, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రొద్దం: ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే జీఎస్టీ సంస్కరణలను తీసుకొచ్చిందని టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని చెరుకూరు గ్రామంలో సూపర్‌జీఎస్‌టీ, సూపర్‌సేవింగ్స్‌పై ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, మారెప్ప, నాగరాజు, నరహరి, అశ్వర్థనారాయణ, మురళి, అంజి, మాజీ సర్పంచ్ కిష్టప్ప, పంచాయతీ కన్వీనర్ - పంచాయతీ కార్యదర్శి రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: జీఎస్‌టీ తగ్గింపుపై పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛాంధ్ర స్టేట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రెడ్డివారి మంజునాథ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులపై జీఎస్టీ తగ్గిందని, అవగాహన కల్పించి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, తెలుగు జిల్లా యువత ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

న్యాయవాదుల డిమాండ్



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏర్పాటు చేయాలని హిందూపురంలో గురువారం న్యాయవాదులు నిరసన ర్యాలీ చేపట్టారు. విధులు బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయడంతో న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అమరావతిలో హైకోర్టు ఉండటంతో న్యాయవాదులకు, కక్షిదారులకు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆలోచించి కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరప్ప, కార్యదర్శి రామచంద్రప్ప, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్, నాగరాజారెడ్డి, సుదర్శన్, సిద్దు, ఇందాద్, క్రిష్ణమూర్తి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రొద్దం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): దొడగట్ట గ్రామానికి చెందిన దేవి(25) కనిపించడంలేదని తల్లిదండ్రులు నాగలక్ష్మీ, కావేరప్ప గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన దేవి రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు తెలిసిన వారితో విచారించగా ఆచూకీ తెలియలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ కాంతప్ప తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కొంకల్లు గ్రామస్థుల వినతి

గుడిబండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఇటీవల వేసిన బోరులో ఇసుక మూసుకుని పోవడం, మోటారు దిగకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. లక్షలు వెచ్చించి పైప్‌లైన్ చేపట్టినా తాగునీరు ప్రజలకు అందడంలేదని వాపోయారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న పాతచాలమపల్లికి చెందిన వడ్డి సురేష్ (26) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు లక్ష్మినారాయణయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథరెడ్డి, భాస్కర్, రాజశేఖర్, శివ ఉన్నారు.

జన్ సమర్థ పోర్టల్‌పై అవగాహన

రొద్దం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జన్‌సమర్థ పోర్టల్‌పై సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. గురువారం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో పీఎంఈజీపీ, ముద్ర, సూర్యఘర్ తదితర వాటిపై ట్రైనర్ రమేష్, మోహన్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంకుమార్, ఏఓ రాకేష్, ఏపీఎం జయచంద్ర, పంచాయతీ కార్యదర్శులు క్రిష్ణమూర్తి, జనార్దన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అనాథలకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఆర్టీసీ బస్టాండు సమీపంలో, రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతిచెందారు. వీరి కుటుంబ సభ్యులు, బంధువులు రాకపోవడంతో పోలీసులు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు యుగంధర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాలను స్మశానవాటికకు తీసుకెళ్లి ఖననం చేశారు.

ఘనంగా పాలుపోసే పండగ

రొళ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నగిరి, నసేపల్లి, జీజీహట్టి గ్రామాల్లో యాదవుల ఆధ్వర్యంలో గురువారం పాలుపోసే పండుగను ఘనంగా నిర్వహించారు. జీజీహట్టి గ్రామంలోని శ్రీయత్తప్ప, చిత్రలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పాలను నైవేద్యంగా పెట్టి మొక్కులను తీర్చుకున్నారు.



జీజీ హట్టి గ్రామంలో యత్తప్ప స్వామి ఊరేగింపు

ఆహార వృథాను అరికట్టండి

ప్రిన్సిపాల్ జయప్ప

పెనుకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆహార వృథాను అందరూ అరికట్టాలని పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయప్ప సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, జంతుశాస్త్రం విభాగంలో ఆహార దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా 150కోట్ల టన్నుల ఆహారం వృథా అవుతోందన్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 68కోట్ల మంది ఆకలి అలమటిస్తున్నారన్నారు. అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని, ఆహారం విలువ ఏమిటో ప్రతి ఒక్కరూ తెలుసుకుని వృథాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రతాప్, ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, హరిప్రసాద్, రామన్న, నాగేష్, లత, లలిత, చంద్రమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

విద్యార్థులు చదువుపట్లనే కాకుండా ఆరోగ్యంపై కూడా శ్రద్ధవహించాలని సత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాఘవయ్య, రిటైర్డ్ టీచర్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ కేశవయ్య, బాటనీ అధ్యాపకులు అనీల్‌కుమార్, సాయిలత, శ్రావణి పాల్గొన్నారు.

ట్యాంకును శుభ్రం చేయించిన అధికారులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్యాంకును శుభ్రం చేయిస్తున్న అధికారులు

సోమందేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదడకల పంచాయతీ కేంద్రంలో వృథాగా మంచినీటి ట్యాం కు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, కార్యదర్శి జయరాం పారిశుధ్య కార్మికులతో ట్యాంకును శుభ్రం చేయించారు. పగుళ్లఉన్నచోట మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పెనుకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

సోమందేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. యువభారత్ ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, సాయినాథ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, హెచ్ఎం రామాంజినేయులు, కన్వీనర్ వెంకటేశులు, కిష్టప్ప, జనసేన నాగరాజు పాల్గొన్నారు.